సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



సచివాలయాల్లో నోటరీ సేవలు
గ్రామ,వార్డు సచివాలయాల వద్ద నోటరీ సేవల అమలుపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు చర్చించారు. 8లో



క్రీడలతో మానసిక ఉల్లాసం
చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ తెలిపారు. 8లో



గుండెకు భరోసా 'స్టెమి'
గుండె వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాల రేటును తగ్గించేందుకు ప్రభుత్వం స్టెమి అనే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 8లో

న్యూస్‌రీల్

సిద్ధి బుద్ధి కల్యాణ గణపతిగా..



సీతమ్మధార : వినాయక నవ రాత్రి ఉత్సవాల్లో భాగం ఆశీలమెట్టలోని ప్రసిద్ధ చెందిన సంపత్ వినాయగర్ ఆలయంలో స్వామి సిద్ధిబుద్ధి కల్యాణ గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటల నుంచే ప్రధాన అర్చకులు మోహన్‌స్వామి ప్రత్యేక పూజలు జరిపారు. 10 గంటలకు శ్రీ వేంటేశ్వర భక్తమండలిచే కోలాటం, విష్ణు సహస్రనామ, సామూహిక పారాయణం సాయంత్రం 5 గంటలకు లలితా డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి రామకృష్ణప్రసాద్



జస్టిస్ రామకృష్ణప్రసాద్‌కు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

విమ్స్‌లో వైద్యుల పోస్టులకు ఇంటర్వ్యూలు రేపు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో వైద్యుల పోస్టులకు ఈ నెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఇక్కడ 43 సూపర్ స్పెషలిస్టు వైద్యులు, జనరల్ వైద్యుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు. ఈ ఇంటర్వ్యూల కోసం విమ్స్ పరిపాలనా విభాగంలో ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

గోపాలపట్నం మండలంలో నేడు 'జగనన్నకు చెబుదాం'

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు గోపాలపట్నం మండల పరిధిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఉదయం పది గంటల నుంచి ఎన్ఎస్‌టీఎల్ గేటు ఎదురుగా శాంతినగర్ కమ్యూనిటీ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సోమవారం జిల్లా స్థాయిలో నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అన్ని శాఖల విభాగాధిపతులు, జీవీఎంసీ అధికారులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని గోపాలపట్నం మండలవాసులు వినియోగించుకోవాలని సూచించారు.

మహాలయ అమావాస్యకు ప్రత్యేక రైలు

బీచ్‌రోడ్డు : మహాలయ అమావాస్యను పురస్కరించుకుని భారతీయ రైల్వే ప్రత్యేకంగా ఉలా రైలును నడుపుతున్నట్లు భారత్ గౌరవ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 10వ తేదీ నుంచి 21 వరకు ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ, అయోధ్య, హరిద్వార్, ఢిల్లీ, మధుర, ఆగ్రా ప్రదేశాల్లో పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. ఈ రైలు మధురై నుంచి బయల్దేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, కాజీపేట స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. వివరాల కోసం 78761 01010 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

24 వరకు రత్నాచల్ రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు కార్యాచరణ కారణాల వల్ల ఈ నెల 24వ తేదీ వరకు విజయవాడ-విశాఖపట్నం-విజయవాడ(12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.


అపురూపాలు

విభిన్న ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న గణనాథుడు


వాడవాడలా గణేష్ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. వినూత్న సెట్టింగ్‌లతో విద్యుద్దీపకాంతులతో మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగా.. విఘ్నాలను తొలగించే ఆ విఘ్ననాయకుడిని కొలువుదీరాడు. నగరంలో వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న లంబోదరుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. వీటిని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.



బీచ్ రోడ్డులో చాక్లెట్ వినాయకుడు



జాలారిపేటలో 'పుష్ప' వినాయకుడు



ఫిషింగ్ హార్బర్ వద్ద బర్త్‌డే బాయ్‌గా..



కోటవీధిలో షిప్‌లో కెప్టెన్‌గా..



లక్ష్మీటాకీస్ వద్ద అమ్మ ఒడి పథకం మండపంలో వినాయకుడు



కోస్టల్ బ్యాటరీ వద్ద కుమారస్వామి అవతారంలో ..



కంచరపాలెం దుర్గానగర్‌లో ఆకట్టుకుంటున్న గణనాథుడు



జాలరిపేటలో ఫుట్‌బాల్ ఆటగాడు రొనాల్డోగా వినాయకుడు



పెదజాలరిపేట వద్ద 'ఆదిపురుష్' అవతారంలో వినాయకుడు



కోస్టల్ బ్యాటరీ వద్ద ఇస్రో శాస్త్రవేత్తల అవతారంలో ..



కంచరపాలెం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



చెంగలరావుపేటలో టాటూ వేస్తున్న వినాయకుడు



వన్‌టౌన్‌లో నెలవంకపై వినాయకుడు

'బ్రౌన్' హంగామా!

- వలకు విరివిగా చిక్కుతున్న రొయ్యలు
- గతేడాదికంటే పెరిగిన వివిధ రకాల రొయ్యల లభ్యత
- 4-5 రోజులకే వేట కుదిస్తున్న మత్స్యకారులు
- స్థానికంగానే ఎక్కువ అమ్మకాలు



ఫ్లవర్ రకం రొయ్యలు



బ్రౌన్ రకం రొయ్యలు

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారుల వలకు రొయ్యలు ఆశాజనకంగా చిక్కుతున్నాయి. వీటిలో బ్రౌన్ రకం రొయ్యలు అధికంగా ఉంటున్నాయి. గతేడాది కంటే ఇటీవల రొయ్యల లభ్యత బాగుండడంతో మత్స్యకారుల మోములు వికసిస్తున్నాయి. మత్స్యకారులు సాధారణంగా 10-15 రోజుల పాటు రొయ్యల వేట సాగిస్తుంటారు. రొయ్యల కోసం బోటులో సముద్రంలో దూరంగా వెళ్తుంటారు. కానీ ఈ మధ్యకాలంలో దూరంగా వెళ్లాల్సిన అవసరం లేకుండానే రొయ్యలు లభ్యమవుతున్నాయి. దీంతో నాలుగైదు రోజులకే ఒక్కో బోటుకు అర టన్ను నుంచి టన్ను వరకు దొరుకుతున్నాయి. దీంతో వేట సమయాన్ని నాలుగైదు రోజులకే కుదించుకుని హార్బర్‌కు చేరుకుంటున్నారు. దీనివల్ల రొయ్యలు తాజాగా ఉంటూ మంచి ధర కూడా లభిస్తోంది. అదే పది రోజులకు పైగా వేట కొనసాగిస్తే వలకు చిక్కిన రొయ్యలను ఐస్‌లో రోజుల తరబడి బోట్లలోనే నిల్వ ఉంచాల్సి వస్తోంది. దీనివల్ల రొయ్యల రంగు మారిపోయి, తాజాదనం కోల్పోయి తక్కువ ధర పలుకుతోంది. ఇది మత్స్యకారులకు లాభదాయకంగా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో రొయ్యలు పుష్కలంగా లభిస్తున్నందున తక్కువ రోజుల వేటకే మొగ్గు చూపుతున్నారు.

విరివిగా బ్రౌన్ రొయ్యలు

కొన్నాళ్లుగా లభిస్తున్న రొయ్యల్లో బ్రౌన్ రకం రొయ్యలే అధికంగా ఉంటున్నాయి. ప్రస్తుతం వీటికి కిలో రూ.350 ధర పలుకుతోంది. ఎగుమతి చేసే రొయ్యల తలలు తీసివేస్తారు. వీటిని హెడ్‌లెస్ ష్రింప్‌గా పేర్కొంటారు. వీటికి కిలోపై రూ.100 వరకు ధర అధికంగా ఉంటుంది. గత సంవత్సరం ఈ సీజనులో వీటి ధర ఒకింత బాగున్నా తక్కువగా లభ్యమయ్యేవి. కానీ ఈ సీజనులో ఇవి విరివిగా దొరుకుతుండడంతో ఊరటనిస్తోందని మత్స్యకారులు చెబుతున్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రొయ్యలు, చేపలను బాస్కెట్ల లెక్కన కొనుగోలు చేస్తుంటారు. రొయ్యల్లో టైగర్, ఫ్లవర్, గోల్డ్/వైట్, బ్రౌన్/పింక్ తదితర రకాలుంటాయి. ప్రస్తుతం కిలో టైగర్ రొయ్యలు రూ.1,100, ఫ్లవర్ రకం రూ.500, గోల్డ్/వైట్ రూ.300, బ్రౌన్ రకం రూ.350 చొప్పున ధర పలుకుతోంది. రొయ్యల కొనుగోలుదారులు, ఎగుమతిదారులు ఆశించినంతగా వీటిని కొనుగోలు చేయకపోయినా స్థానికంగానే ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో 70 శాతానికి పైగా బోట్లు సమీపంలోనే రొయ్యల వేట సాగిస్తున్నారని, దీంతో నాలుగైదు రోజులకే తీరానికి చేరుకుంటున్నారని వైశాఖి డాల్ఫిన్ బోట్ ఆపరేటర్ల సంక్షేమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సూరాడ సత్తిబాబు 'సాక్షి'కి చెప్పారు. దీనివల్ల రొయ్యలు తాజాగా ఉండడంతో స్థానికంగా విక్రయాలు బాగా జరుగుతున్నాయని తెలిపారు.

నేటి నుంచి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

అగనంపూడి (గాజువాక): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీల ఎంపికలు నిర్వహించనున్నట్లు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, ఎం.వి.నాగేశ్వరరావు, పి.సూరిబాబు తెలిపారు. వాలీబాల్ అండర్-17 (బాలురు, బాలికల) ఎంపికలు ఈ నెల 20న గాజువాక మండలం, కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. 25న ఖోఖో బాలురు, బాలికలు (అండర్-14, 17) విభాగాల పోటీలు పరవాడ మండలం లంకెలపాలెం హైస్కూల్లో నిర్వహించనున్నారు. 26న త్రోబాల్ అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో అచ్యుతాపురం మండలం హరిపాలెంలోనూ, అదే రోజు కబడ్డీ అండర్ -14, 17 బాలురు, బాలికల విభాగాల్లో మాకవరపాలెం హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 27న బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు కొత్తపేట (యలమంచిలి)లో అండర్ 14, 17 (బాలురు, బాలికల) విభాగాల్లో నిర్వహించనున్నారు. అదేరోజు పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్నీకాయిట్ బాలురు, బాలికలు (అండర్-14, 17) విభాగాల్లో ఎంపికలు చేపట్టనున్నారు. 30న త్రోబాల్ అండర్ 17 (బాలురు, బాలికల) విభాగంలో ఎంపికలు కణితి హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. క్రీడాకారులు అర్హత పత్రాలతో ఆయా కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.

రితీ సాహా మృతిపై వైద్యుల కమిటీ విచారణ

మహారాణిపేట : ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థిని రితీ సాహా కేసుకు సంబంధించి కేజీహెచ్‌లో విచారణ మొదలైంది. అయిదుగురు వైద్యులతో కూడిన విచారణ కమిటీ మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విచారణ నిర్వహించింది. పలువురి నుంచి వివరాలు సేకరించిన కమిటీ మరోసారి విచారణ చేయాలని నిర్ణయించింది. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన రితీ సాహా జూలై 14వ తేదీన ఆ కళాశాల అవుట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహిస్తున్న సాధన హాస్టల్ భవనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన ఆమెకు ముందుగా వెంకటరామ ఆస్పత్రిలోను, తరువాత కేర్ ఆస్పత్రికి చికిత్స అందించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మరణించిందని మృతురాలి తండ్రి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్‌కు డీఎంహెచ్‌వో సూచించడంతో కేజీహెచ్ న్యూరో మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బి.హయగ్రీవరావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.సత్యప్రసాద్, అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ వి.రవి, కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మణిత, ఆర్థోపెడిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.రజనీ కుమార్‌లతో విచారణ కమిటీ వేశారు. మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించిన కమిటీ విచారణకు రితీ సాహా తల్లిదండ్రులు, చికిత్స చేసిన ఆస్పత్రి వైద్యులు, ల్యాబ్ సిబ్బంది, నిర్వాహకులు హాజరయ్యారు. అన్ని రికార్డులు, రిజిస్టర్లతో పాటు సీటీ ఫిల్మ్ అండ్ రిపోర్ట్, ఎక్స్ రే ఛాతి ఫిల్మ్, రిపోర్ట్, సీటీ బ్రెయిన్ రిపోర్ట్, డెత్ కేసుకు సంబంధించిన ఇతర నివేదికలు విచారణ కమిటీకి సమర్పించారు.

22న జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశంలో 20 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా గాజువాక జోన్ 77వ వార్డులో పెదపాలెం నుంచి చినపాలెం వరకు రూ.49.60 లక్షలతో బీటీ రోడ్డు మరమ్మతులు, విస్తరణ, అలాగే రూ.49.90 లక్షలతో చినపాలెం నుంచి పిట్టవానిపాలెం వరకు బీటీ రోడ్డు మరమ్మతులు, విస్తరణ, 65వ వార్డులో రూ.49.95 లక్షలతో భానోజీ కాలనీలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ.49.84 లక్షలతో అశోక్‌నగర్‌రావు నంబర్-1 వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం, రూ.37.65 లక్షలతో వికాస్‌నగర్ నివాసితుల సంక్షేమ సంఘం బిల్డింగ్ పునరుద్ధరణ, రూ.35 లక్షలతో 87వ వార్డు వడ్లపూడి రాజులపాలెం పార్కులో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ.49.95 లక్షలతో 69వ వార్డు నాతయ్యపాలెం కల్యాణమండపం మొదటి అంతస్తు నిర్మాణం, రూ.49.78 లక్షలతో నాతయ్యపాలెం బంగారమ్మ గుడి నుంచి కిమ్స్ ఐకాన్ హాస్పటల్ వరకు హాట్‌మిక్స్ ప్రక్రియ ద్వారా బీటీ రోడ్డుకు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. జోన్-4 పరిధి 28 నుంచి 39వ వార్డుల వరకు, జోన్-5 పరిధి 40 నుంచి 63వ వార్డుల వరకు పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని కొనసాగించేందుకు, మలేరియా, డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సేవలకు 30 మంది స్ప్రేయింగ్ వర్కర్స్‌ను రోజుకూలీ కింద సెప్టెంబర్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగించేందుకు, జోన్-4 పరిధి జగదాంబ వాణిజ్య సముదాయంలో గల 1, 2 దుకాణాలను రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖకు రెండేళ్ల కాలానికి ఇవ్వడం తదితర అంశాలు చర్చకు రానున్నాయి.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ



వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఓటరు జాబితా సవరణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం విజయవాడ ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అనర్హుల ఓటర్లకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు అన్నింటిని పరిశీలించామని రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. ఇంటింటి ఓటరు సర్వే పకడ్బందీగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్.విశ్వనాథన్, ఆర్డీవోలు హుస్సెన్ సాహెబ్ (విశాఖ) భాస్కరరెడ్డి (భీమిలి), డిప్యూటీ కలెక్టర్లు, ఈఆర్‌వోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రమేష్, డిప్యూటీ తహసీల్దార్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

22,23 తేదీల్లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

సాక్షి,పాడేరు: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ ఈనెల 22, 23 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తున్నారని ఎన్‌సీఎస్టీ రిసెర్చ్ అధికారి పీకే పరిడ మంగళవారం జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటన అనంతరం ఈనెల 22వ తేదీ శుక్రవారం సాయంత్రం ఆయన పాడేరు చేరుకొని 5.30 గంటలకు గిరిజన సంఘాలతో సమావేశం నిర్వహిస్తారు. రాత్రి పాడేరులోనే బస చేసి 23వతేదీ ఉదయం 9.30 గంటలకు హుకుంపేట మండలంలోని మఠం గ్రామంలోని వనవాసీ కల్యాణ ఆశ్రమం, మత్స్యలింగేశ్వరస్వామి విద్యా నిలయాన్ని సందర్శిస్తారని ఆయన వెల్లడించారు. అక్కడ నుంచి నేరుగా ఉప్ప గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చేరుకుని ఇక్కడ గిరిజన విద్యార్థినులతో సమావేశం అవుతారని తెలిపారు. అనంతరం 11 గంటలకు పాడేరు చేరుకుని ఏకలవ్య, కేజీబీవీ విద్యాలయాలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం భోజన విరామ అనంతరం 2.30 గంటలకు అన్ని శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు ఇక్కడి నుంచి విశాఖపట్నం వెళ్తారని ఆయన తెలిపారు.

ఎంపీహెచ్‌ఈవో కౌన్సెలింగ్‌లో గందరగోళం

- ఇటీవల పోస్టులను తిరస్కరించిన ఎంపీహెచ్‌ఈవోలకు కౌన్సెలింగ్
- మంజూరు పోస్టులు లేకపోయినా ముగ్గురికి అందలం
- బదిలీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు
- నిబంధనలు పాటించలేదని వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీకి షోకాజ్ నోటీస్



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎంపీహెచ్‌ఈవోలు

మహారాణిపేట: మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఎంపీహెచ్‌ఈవో) బదిలీల్లో గందరగోళం జరిగింది. మంగళవారం నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌లో అనర్హులకు అందలం ఎక్కించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ఇద్దరు వైద్యులతో పాటు మొత్తం 14 మంది సిబ్బంది కోసం రీఫిక్సింగ్(సర్దుబాటు) కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం గత కొద్ది రోజుల నుంచి చేపడుతోంది. వివిధ పోస్టులకు సంబంధించి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. మంగళవారం జరిగిన కౌన్సెలింగ్‌లో మొత్తం 18 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం అధికారులు, ఉన్నతాధికారులు నిబంధనలు పాటించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బదిలీల్లో తమ ఉద్యోగులకు అన్యాయం జరిగిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. కొంత మంది ఎంపీహెచ్‌ఈవోలు సైతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులను కలిసి తమకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేశారు. అలాగే డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే కౌన్సెలింగ్ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరికి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రామారెడ్డి షోకాజ్ నోటీసు జారీచేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.


నిబంధనలకు పాతర?

జీవో 143 ప్రకారం ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని కోసం గత నెల 26వ తేదీన ఎంపీహెచ్‌ఈవోలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 6 జిల్లాల నుంచి 74 మందిని ఆహ్వానించారు. వీరిలో 18 మంది కౌన్సెలింగ్‌లో వచ్చిన పోస్టును తిరస్కరించారు. వీరి కోసం మంగళవారం తిరిగి వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. అయితే ఈ కౌన్సెలింగ్‌లో అధికారులు నిబంధనలు పక్కన పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ కౌన్సెలింగ్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనర్హులకు ముగ్గురికి పోస్టింగులు ఇచ్చినట్లు సమాచారం. ఇందులో ఒకరు టీఎన్‌టీయూసీకి చెందిన నాయకుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరికి విశాఖలోను, ఒకరికి అనకాపల్లిలో పోస్టింగ్ కల్పించారు. నిబంధనల ప్రకారం బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించామని వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ డాక్టర్ ఉమాసుందరి తెలిపారు. దీనిలో పలు అసోసియేషన్ల వినతులు అందజేయగా, వాటిని తిరస్కరించామన్నారు. ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది ఉండాలన్న నిబంధన ప్రకారం బదిలీ చేశామని చెబుతున్నారు.

అధికార భాషా సంఘం అధ్యక్షుడి రాక నేడు

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం విశాఖ రానున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి చేరుకున్న అనంతరం ప్రభుత్వ అతిథిగృహానికి వెళ్తారు. ఉదయం 10.45 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో అధికార భాషగా తెలుగు అమలుపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మీడియా సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు తెలుగు సాహితీ ప్రముఖులతో చర్చాగోష్టి అనంతరం సాయంత్రం 6 గంటలకు ఏయూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అసెంబ్లీ మందిరంలో నిర్వహించే తెలుగు మాధ్యమాల దినోత్సవం (తాపీ ధర్మారావు జయంతి) కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో జరిగే గురజాడ అప్పారావు జయంతి వేడుకల్లో పాల్గొంటారు.

మీ గుండెకు భరోసా



విజయవంతంగా ప్రాజెక్టు
- గుండె భద్రతకు సర్కారు సాయం
- విశాఖలో ప్రయోగాత్మకంగా అమలు

మహారాణిపేట: గుండె సంబంధిత వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాల రేటును తగ్గించేందుకు ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన వారికి అత్యంత కీలకమైన మొదటిగంటలోనే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (స్టెమి) ప్రాజెక్టుకు వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన తొలి గంటలోపే అంటే గోల్డెన్ అవర్‌లోపే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా రోగి ప్రాణాలు నిలబెట్టేందుకు అవకాశం ఉంది. ఈ పైలట్ ప్రాజెక్టు విశాఖలో విజయవంతంగా అమలు చేస్తున్నారు.

గుండెనొప్పి వచ్చిన వారికి తక్షణం థ్రాంబోలిసిస్‌కు సంబంధించిన ఇంజెక్షన్లు ఇవ్వాలి. దీని ఖరీదు సుమారు రూ.40వేలు వరకు ఉంటుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన వివిధ ఆస్పత్రుల్లో ఈ ఇంజెక్షన్ ఉచితంగా ఇచ్చి రోగి ప్రాణాలు కాపాడుతున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి విశాఖలో 14 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీ)ల్లో ఈ ప్రాజెక్టు అమలవుతోంది. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉండే బోధనాస్పత్రుల్లో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా ఉండే వైద్య విధాన పరిషత్ పరిధిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ)లో కూడా అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్‌గా ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిశోర్‌ను ప్రభుత్వం నియమించింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏయే ఆస్పత్రుల్లో...

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 14 ఆస్పత్రులను ఎంపిక చేశారు. విశాఖ జిల్లాలో ఏరియా ఆస్పత్రి (అగనంపూడి), భీమిలి, గోపాలపట్నం, పెందుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, అనకాపల్లి జిల్లా ఆస్పత్రితో పాటు కె.కోటపాడు, యలమంచిలి, నర్సీపట్నం, కోటవురట్ల, నక్కపల్లి, చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అల్లూరి జిల్లాలోని అరకు ఏరియా ఆస్పత్రి, పాడేరు జిల్లా ఆస్పత్రి, వి.మాడుగుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

ఒక్కో ఆస్పత్రికి ప్రత్యేకంగా అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి ఆస్పత్రిలో ఐసీయూ, ఆక్సిజన్, వెంటిలేటర్ ఇతర పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో ఆస్పత్రిలో థ్రాంబోలిసిస్‌కు సంబంధించిన ఇంజెక్షన్లు రెండేసి అందుబాటులో ఉన్నాయి.

లబ్ధి ఇలా..

- గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన యు.గిరిధర్ (55) ఈనెల 7వ తేదీన ఆకస్మాతుగా గుండెనొప్పి వచ్చింది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు.
- రోలుగుంట మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన అనిమిరెడ్డి నాగరాజు (70)కు ఈనెల 15వ తేదీన గుండెనొప్పి రావడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు.
- కూర్మన్నపాలెం ప్రాంతం శాతవాహననగర్‌కు చెందిన గున్నం రత్నం (78)కి ఈనెల 2వ తేదీన గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకొని వచ్చి ఇంజెక్షన్ ఇచ్చారు. దీంతో రత్నం ప్రాణాలను వైద్యులు కాపాడారు.

అత్యవసర సేవలు

గుండె నొప్పి వచ్చిన వెంటనే తొలుత ఈసీజీ తీయాల్సి ఉంటుంది. ఈ రిపోర్టును కార్డియాలజీ విభాగంలో విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మికి వాట్సప్‌ద్వారా పంపుతున్నారు. వారి సలహా, కార్డియాలజీ వైద్యుల సూచన మేరకు రోగికి సుమారు రూ.40 వేలు విలువ చేసే టెనెక్టెప్లాస్ ఇంజక్షన్ ఉచితంగా ఇస్తున్నారు. ఇప్పటి వరకు నర్సీపట్నంలో రెండు, అగనంపూడిలో ఒక ఇంజెక్షన్ ఇచ్చారు. దీని వల్ల తక్కువ వ్యవధిలో ముగ్గురు ప్రాణాలను వైద్యులు కాపాడారు.

విజయవంతంగా..



స్టెమి ప్రాజెక్టు ఉమ్మడి విశాఖ జిల్లాలో విజయవంతంగా అమలు జరుగుతోంది. అకస్మాత్తుగా గుండె జబ్బులు వస్తే సంబంధిత ఏరియాలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులను సంప్రదించాలి. వైద్యం అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. గుండె జబ్బులున్న వారికి స్టెమి ఓ బాసటగా నిలుస్తోంది.
–డాక్టర్ రమేష్ కిశోర్, ప్రాజెక్టు నోడల్ అధికారి

ప్రాణాలు కాపాడారు



నా వయస్సు 78ఏళ్లు. ఈనెల 2వ తేదీన గుండె నొప్పి వచ్చింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశా. అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. అక్కడ పరీక్షలు చేశారు. ఆ తర్వాత టెనెక్టెప్లాస్ ఇంజక్షన్ ఇచ్చారు. కొద్ది రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు. ఇప్పుడు ఆరోగ్యం కుదుటపడింది.
–గున్నం రత్నం, శాతవాహన నగర్, కూర్మన్నపాలెం

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినాయక పూజలు


పూజలు నిర్వహిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గణపతి పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయ పరిశీలకుడు రవిరెడ్డి, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడిదబోయిన రాములప్పడు, వైఎస్సార్ సీపీ 8వ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్ పాల్గొన్నారు.


పండగ పూట విషాదం

యారాడ తీరంలో బాలుడి గల్లంతు


కల్యాణ్ కుమార్ (ఫైల్)

పెదగంట్యాడ: వినాయకచవితి పండగ ఆ ఇంట విషాదం నింపింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కన్నపేగును సంద్రం తీసుకుపోయింది. యారాడ తీరంలో అలలధాటికి సోమవారం మధ్యాహ్నం ముసరాన కల్యాణ్ కుమార్(16) మృతి చెందాడు. న్యూపోర్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..పెదగంట్యాడ దయాల్ నగర్ లోవకు చెందిన ముసరాన కల్యాణ కుమార్ తల్లి, చెల్లితో కలసి నివాసం ఉంటున్నాడు. తండ్రి మృతి చెందడంతో చదువు మానేసి చిన్నచిన్న పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉన్నాడు. గాజువాక సింహగిరి కాలనీకి చెందిన స్నేహితులు చెన్నూరి శివకుమార్, కొండమంచి శ్రీను, కల్యాణం శ్రీను, సుశాంత్‌తో కలసి సోమవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో యారాడ తీరానికి వెళ్లాడు. 4.30 సమయంలో వీరంతా స్నానం చేస్తుండగా పెద్ద అల రావడంతో కల్యాణ్ కుమార్, కల్యాణం శ్రీను సముద్రంలోకి కొట్టుకుపోతుండగా..అక్కడే ఉన్న లైఫ్ గార్డ్స్ శ్రీనును రక్షించారు. కల్యాణ కుమార్ జాడ కనిపించలేదు. వెంటనే వారు న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ రాము సిబ్బందితో కలిసి తీరానికి చేరుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన కల్యాణ్ తల్లి సంతోషి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ రాము ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనేరులో పడి మహిళ మృతి


నాగమణి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని కోనేరులో పడి మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గాజువాక పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుంగ్లాంలో సామోజు చినసత్యనారాయణ, నాగమణి (58)లు నివసిస్తున్నారు. మంగళవారం కోనేరులో ఆమె మృతదేహాన్ని స్థానికుల కనుగొన్నారు. మట్టి వినాయక ప్రతిమను భెల్ (హెచ్‌పీసీఎల్) గేటు పక్కనున్న కోనేరులో నిమజ్జనం చేసేందుకు వచ్చి ప్రమాదవశాత్తు ఆమె పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై ఎం.రవికుమార్ మృతదేహాన్ని బయటకు తీశారు. నాగమణికి మతిస్థిమితం సరిగా లేదని బంధువులు, గ్రామస్తులు తెలిపారు. వీరికి శారద, నూకరత్నం అనే ఇద్దరు కుమార్తెలున్నారు. శారదకు వివాహం కాగా, నూకరత్నం ఆటోనగర్‌లో కూలిపనులకు వెళ్తుందని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

సింహాచలం: చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ తెలిపారు. అడవివరంలో ఉన్న మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బీసీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని సుమారు 55 ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలకు చెందిన సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గౌరీశంకర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈసందర్భంగా నాలుగు విభాగాల్లోను ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలబాలికలను విభాగానికి 16 మంది చొప్పున మొత్తం 64 మందిని ఈనెల 29నుంచి వచ్చేనెల1వతేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, పీఈటీలు దుర్గాప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.



చికెన్ ధరలు	
చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం	: రూ.118
బ్రాయిలర్ (లైవ్)	: రూ.138
స్కిన్	: రూ.246
స్కిన్‌లెస్	: రూ.256

కోడిగుడ్ల ధరలు	రూ.లలో (వందకు)
విశాఖ	535.00
విజయనగరం	539.00
శ్రీకాకుళం	539.00

ఉపాధ్యాయులకు అండగా వైఎస్సార్ టీఎఫ్


సభ్యత్వాన్ని అందజేస్తున్న చొక్కాకుల

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటామని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ అన్నారు. యూనియన్ సభ్యత్వ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం జిల్లాలోని పలు స్కూళ్లను సందర్శించారు. పెందుర్తి ఎమ్మార్సీలో ఉమ్మడి విశాఖ జిల్లా మినిమం టైం స్కేల్ 1998 ఉపాధ్యాయుల సమావేశమయ్యారు. ఎన్నో ఏళ్ల తరువాత ఉద్యోగాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిలకు 1998 ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చొక్కాకుల మాట్లాడుతూ సర్వీసు పెంపు, రెగ్యులర్ ఉపాధ్యాయులు మాదిరే ఇతర అలవెన్సులు కల్పించేలా వైఎస్సార్ టీఎఫ్ తరుపున ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులకు నూతన సభ్యత్వాలను అందజేశారు. వైఎస్సార్ టీఎఫ్ సంఘాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాలో బలోపేతం చేసే దిశగా తగిన కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు. ఉపాధ్యాయులు కొట్యాడ జగన్నాథం, సిరికి సూర్యనారాయణ, సంజీవరావు, వెంకటరావు, కొరుపోలు సూరిదేవుడు, సుబ్బారావు, దుర్గా షరీఫ్ పాల్గొన్నారు.

నాలుగు భాషల్లో 'ఉక్కు సత్యాగ్రహం'


మాట్లాడుతున్న దర్శకుడు, నిర్మాత సత్యారెడ్డి

దాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు తెలుగువారి హక్కు అనే నినాదంతో 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా రూపొందించినట్టు దర్శక నిర్మాత, హీరో సత్యారెడ్డి తెలిపారు. మంగళవారం చిత్ర యూనిట్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ పల్సర్ బైక్ ఝాన్సీ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిందన్నారు. చిత్రంలో దివంగత ప్రజాగాయకుడు గద్దర్ మూడు పాటలు రాయగా..సుద్దాల అశోక్ తేజ రెండు పాటలు రాశారన్నారు. ఇందులో గద్దర్ పాత్ర వీరోచితంగా ఉంటుందని, ఇదే ఆయన చివరి చిత్రమన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న పోరాటాన్ని తెరకెక్కించామన్నారు. తెలుగు, కన్నడ, తమిళ్, హిందీ భాషల్లో విడుదల చేయనున్నామన్నారు. త్వరలోనే ఆర్కేబీచ్‌లో చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్టు సత్యారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో కొద్ది రోజుల్లో టీజర్, ట్రైలర్ విడుదల చేస్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పోరాట నాయకులు ఆదినారాయణ, అయోధ్యరామ్ మాట్లాడుతూ 900 రోజులుగా కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని సత్యారెడ్డి ఈ సినిమా తీయడం అభినందనీయమన్నారు. అనంతరం చిత్ర యూనిట్ సినిమా టైటిల్‌ను విడుదల చేసింది. హీరోయిన్ పల్సర్ బైక్ ఝాన్సీ మాట్లాడుతూ ఓ రియల్ స్టోరీగా తెరకెక్కిన ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో నటుడు ప్రసన్నకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సచివాలయాల వద్ద నోటరీ సేవలు

విధివిధానాలపై చర్చించిన అధికారులు

మహారాణిపేట: గ్రామ,వార్డు సచివాలయాల వద్ద నోటరీ సేవలు అమలుపై అధికారులు చర్చించారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, గ్రామ వార్డు సచివాలయ శాఖ సమన్వయంతో నోటరీ ప్రాక్టీషనర్లతో సమావేశం నిర్వహించారు. సచివాలయాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి రిజిస్ట్రార్ ప్రాక్టిషనర్లను వారానికి రెండు రోజుల పాటు సచివాలయాల పరిధిలో అందుబాటులో ఉంచాలని వార్డు సచివాలయ సమన్వయ అధికారి ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. నోటరీ సర్వీసులకు సచివాలయాల స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీసుకొనే చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, 84 మంది నోటరీ ప్రాక్టీషనర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం కావాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అంకితభావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి విభాగాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిశీలకులు జి. రవిరెడ్డి, పార్టీ అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆళ్ల శివగణేష్, అద్దాల కృపా జ్యోతి, మాన్యాల శ్రీనివాస్, బోని శివరామకృష్ణ, పెంద్ర అప్పన్న, నమ్మి లక్ష్మణరావు, కలిదండి భద్రినాథ్, వంకాయల మారుతి ప్రసాద్, వానపల్లి ఈశ్వరరావు, దొడ్డి రామనాథ్, చిక్కా సత్యనారాయణ, లంక రాంబాబు, గొండ ఉమామహేశ్వరరావు, కోరాడ అప్పలస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ


పతకాలతో చంద్రంపాలెం విద్యార్థులు

మధురవాడ: జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. హర్యానా రాష్ట్రం రోహతక్‌లో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఆధ్వర్యంలో నేషనల్ సబ్ జూనియర్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలు ఈ నెల 8నుంచి 11వరకు మహర్షి దయానంద్ యూనివర్సిటీలో జరిగాయి. ఈ పాఠశాలకు చెందిన ఎస్.రేవంత్, పి.పూర్ణచందు సిల్వర్, ఎస్.తరుణ్, వి.మహేంద్ర, వినయ్ సింగ్, సాద్విక్, ఎం.చిన్న బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, పీఈటీ మురళి తదితరులు విజేతలను అభినందించారు.